ఉపాధి పనుల తనిఖీలు

విశాలాంధ్ర-కాకుమాను : గత ఏడాది మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఆడిట్ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. బీకే పాలెం, లింగంగుంట పాలెం, అప్పాపురం గ్రామాలలో తనిఖీలు నిర్వహించి గ్రామసభలు జరిపారు. తనిఖీలలో నమోదు చేసిన వివరాలను సభలలో చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శరత్, ఏపీవో సింగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

17న ఉద్యోగమేళా

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు : మండల పరిధిలోని పుల్లడిగుంట ప్రియదర్శిని ఫార్మసీ కళాశాలలో ఈ నెల 17న ఔషధ కంపెనీ ప్రతినిధుల ఉద్యోగం ఎలా నిర్వహిస్తున్నారని ప్రిన్సిపల్ చందు బాబురావు తెలిపారు. 10వ తరగతి ఇంటర్, ఐటీఐ సంబంధించిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర-పెదనందిపాడు : పర్చూరు రహదారిలో నల్లమడ వాగు వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. వారిని స్థానిక పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేసి 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

విశాలాంధ్ర-కాకుమాను : మండల పరిధిలోని కొమ్మూరులో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీంద్ర తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

జాబ్ కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి

విశాలాంధ్ర-కాకుమాను : జాబ్ కార్డు ఉన్నవారికి పనుల్ని కల్పిస్తున్నామని కూలీలంతా సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పి.ఆచారి తెలిపారు. అప్పాపురం పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పనులపై గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ సింగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : యర్రబాలెం శివాలయం ఎదుట స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. యర్రబాలెంకు చెందిన దివంగత ఎన్.నరసింహారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఎన్.నాగరాజు చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, దానబోయిన నాగయ్య, షేక్ షఫీ, షేక్ గౌస్, జాన్, బడేమియా పాల్గొన్నారు.

శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి విశేష పూజ

విశాలాంధ్ర-చేబ్రోలు: శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి లక్ష తమలపాకులతో విశేష పూజ నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని కొత్త రెడ్డిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెబాట

విశాలాంధ్ర-చేబ్రోలు: పంచాయతీలో కాంట్రాంక్ట్ కార్మికులుగా పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. పంచాయతీ అధికారులకు అనేక సార్లు విన్నవించినవారు సక్రంగా స్పందించకపోవటంతో సమ్మె చేస్తున్నామని తెలిపారు. మండల కేంద్రం చేబ్రోలు పంచాయతీలో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్న వారు శనివారం ఉదయం నుంచ విధులకు నిర్వహించకుండా నిరసన తెలిపారు. దీంతో పంచాయతీ పరిధిలోని అన్ని వార్డులో ఎక్కడి చెత్త చెదారం అక్కడే నిలిచిపోయాయి. పంచాయతీ అధికారులు స్పందించి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించి విధులకు హాజరయ్యే విధంగా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

144 సెక్షన్ అమలు

విశాలాంధ్ర-తుళ్ళూరు : మండల వ్యాప్తంగా శనివారం 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తుళ్లూరు సీఐ ఆనందరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఓ వైపు రాజధాని రైతులు, మరోవైపు వైసీపీ నేతలు ర్యాలీలు చేయనున్న నేపథ్యంలో లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలుకు అనుమతులు తీసుకున్నట్టు స్పష్టం చేశారు.

బీజేపీకి బుద్ధి చెప్పిన కర్ణాటక ప్రజలు

విశాలాంధ్ర-గుంటూరు : కర్నాటకలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు బుద్ధిచెప్పారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నేషనల్ వైస్ ఛైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ అన్నారు. మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావలసిన బలాన్ని అందించి ప్రజా వ్యతిరేక బీజేపీకి గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. కర్ణాటక ఎన్నికల్లో బీజేపీపై వ్యతిరేకత వ్యక్తమైందని, దీంతో నిరంకుశ బీజేపీ పాలనకు పతనం ప్రారంభమైందని, అలాగే రాబోయే ఇతర రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఇదే రకమైన బీజేపీ వ్యతిరేక తీర్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఏపీలో బీజేపీతో పొత్తుకు ఉవ్విళ్ళూరుతున్న పార్టీలకూ ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని జమీల్ అహ్మద్ బేగ్ అన్నారు.

వంతెనకు మోక్షం ఎప్పుడు..?

విశాలాంధ్ర-చేబ్రోలు: కొమ్మమూరు కాలువపై చేబ్రోలు శివారులు బిటిషుకాలంలో నిర్మించిన వంతైన శిధిలావస్థకు చేరింది. గతంలో వంతైన పై ఒక భాగం కూలిపోయింది. నేడు వంతైన పై గుంతలు ఏర్పడి ఎప్పుడు కూలిపోతుందో అని ప్రయాణికులు, వాహన దారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీల నాయకులు తమ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ప్రకటనలు చేస్తున్నారే కానీ వంతైన నిర్మాణ పనులు చేపట్టటం లేదని పేర్కొంటున్నారు. వంతైన కూలి పెను ప్రమాదం జరకముందే వంతైన నిర్మాణ పనులు చేయాలని చేబ్రోలు ప్రజలు, రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రైతుల టెంట్ తొలగింపు

విశాలాంధ్ర-తుళ్ళూరు : ఆర్-5 జోన్ పనులకు నిరసనగా అమరావతి రైతులు దొండపాడు, నెక్కల్లు గ్రామాల మధ్య ఉన్న లేబిట్ అభివృద్ధి పనులను శుక్రవారం అడ్డుకున్న విషయం తెలిసిందే. అయితే ఆర్-5 జోన్ పనులకు నిరసనగా శనివారం లేబిట్ వద్ద అమరావతి రైతులు టెంట్లు వేసుకొని నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు వేసుకున్న టెంట్‌ను పోలీసుల సహకారంతో తొలగించారు.

కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు

విశాలాంధ్ర-మంగళగిరి: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో మంగళగిరి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జి షేక్ సలీం ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు జరిగాయి. బాణాసంచా పేల్చి కార్యాలయం వద్ద నాయకులు కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కంతేటి జీవన సాగర్, శామ్యూల్, హనుమంతరావు, కృష్ణ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి ధర్నా జయప్రదం చేయండి..

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ

విశాలాంధ్ర-గుంటూరు : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాల అమలుకై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఈ నెల 15వ తేదిన జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ ఎర్రజెండా నీడన అనేక దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న 1996 కేంద్ర భవన నిర్మాణ చట్టాన్ని నిర్వీర్యం చేసి సంక్షేమ బోర్డులో ఉన్న రూ.1600 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం పవర్ ఫైనాన్స్ పేరుతో దారిమళ్లించి, వైఎస్సార్ బీమా పేరుతో పూర్తిగా సంక్షేమ బోర్డుని నిర్వీర్యం చేయాలని చూస్తుందన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో జరిగే నిర్మాణాల వద్ద 1 శాతం చెస్ వసూలు చేసుకుంటూ, ఆ డబ్బులు కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నామంటూ అబద్ధాలు వల్లిస్తూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇసుక కొత్త పాలసీ ఏర్పాటు చేయటం వలన పనులు లేక అనేకమంది కార్మికులు అర్ధాకలితో అలమటిస్తు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సుమారు 47 మంది కార్మికులను ఈ ప్రభుత్వం పొట్టన పెట్టుకున్నదని, దానికి తోడు కరోనా లాక్ డౌన్ వల్ల పనులు లేక ఉన్న ఆస్తులను అమ్ముకొని ప్రాణాలు కాపాడుకొని ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులకు సంబంధించిన 32 వేల క్లైములు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ మూడు సంవత్సరాల 11 నెలల నుంచి ఏ ఒక్క క్లైమ్ కూడా పరిష్కరించ లేదన్నారు. ప్రభుత్వ సొంత స్కీములకు బోర్డు నిధులు మళ్లించుకొని కార్మికులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో సిమెంట్, స్టీలు, పెయింట్, కలప, ఎలక్ట్రికల్ తదితర నిర్మాణ మెటీరియల్ ధరలు ఆకాశాన్ని అంటి బిల్డర్స్ అందరూ కూడా నిర్మాణ రంగాన్ని నిలుపుదల చేయటం వలన పనులు లేక కార్మికులు ఇబ్బందులతో సతమతమౌతున్నారన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల పట్ల అవలంబిస్తున్న మొండి వైఖరిపై అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ధర్నా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం డిప్యూటీ కార్యదర్శి రావుల అంజిబాబు, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 1 రద్దు హర్షణీయం: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 1ను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పునివ్వడం హర్షణీయమని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. ప్రజా సమస్యలపై ఆందోళనలు, ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించటంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీఓను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల తీర్పు అన్నారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో ప్రజలు ప్రభుత్వ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని నెపంతో నాటి స్వతంత్ర యోధులపై ఆనాటి ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓను అనుసరిస్తూ నేటి జగన్ ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభించటానికి ప్రజల గొంతు నొక్కి వేయటానికి జీఓ 1ను తీసుకురావడంపై ప్రజావ్యజ్యం కింద సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హైకోర్టులో ఫిల్ వేయడం జరిగిందని అన్నారు. దీనిపై వాదనలు విన్న హైకోర్టు ప్రజా వ్యతిరేకంగా ఉన్న జీఓ 1ని రద్దు చేయాలని తీర్పునివ్వడం జరిగిందని తెలిపారు. ఈ తీర్పు ద్వారా రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను పాలక ప్రభుత్వానికి చెంపపెట్టుగా నిలుస్తుందని ఈ ప్రభుత్వానికి ఎన్నిసార్లు హైకోర్టు అక్షింతలు వేసినా కానీ తన పని విధానం మార్చుకోకపోవడం చాలా దారుణమని అన్నారు. ఇప్పటికైనా తన విధానాన్ని మార్చుకొని ప్రజా అనుకూల విధానాలను అవలంబించాలని ఆయన హితవుపలికారు. ప్రజారంజక తీర్పును ఇచ్చిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు ఈ కేసుని వాదనలో వినిపించిన లాయర్లకు సీపీఐ తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ తీర్పు విజయాన్ని స్వాగతిస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, శశి, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎన్సస్కో పిక్ అంపులెక్టమీ అనే అరుదైన శస్త్ర చికిత్సను గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రి గ్యాస్ట్రో ఏంట్రాలజీ వైద్యులు విజయవంతం చేశారు. కృష్ణా జిల్లా విజయవాడ రామాలయం నగర్‌కు చెందిన మత్తాడ దాసు (55) ఈ నెల 5వ తేదీన పచ్చ కామెర్ల వ్యాధితో గ్యాస్ట్రో ఏంట్రాలజీ ఓపీకి వచ్చారు. ఆ విభాగం ఆచార్యులు డాక్టర్ కవిత, సహాయ ఆచార్యులు డాక్టర్ నాగూర్ బాషా పేషంట్‌కు వైద్య పరీక్షలు చేశారు. పసరతిత్తి నాళం, పాంక్రీజ్ నాళం కలిసే చోట చిన్న గడ్డ ఎండోస్కోపీ ద్వారా ముక్క పరీక్ష చేశారు. ఈ పరీక్షలో రోగికి తుది దశలో క్యాన్సర్ ఉందని నిర్ధారించారు. ఇందుకోసం ఎండోస్కోపిక్ అంపులెక్టమీ చేయాలని నిర్ణయించి ఈ నెల 10వ తేదీన ఎండోస్కోపి ద్వారా పేషంట్‌కు శస్త్ర చికిత్స చేశారు. పేషంట్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో శనివారం డిశ్చార్జ్ చేశారు. తుది దశలో ఉన్న క్యాన్సర్ గడ్డను ఎండోస్కోపి ద్వారా సర్జరీ చేసి పేషంట్‌ను కాపాడారు. జిల్లాల్లో తొలిసారిగా ఈ సర్జరీ చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తెలిపారు. వైద్య బృందానికి ఆమె అభినందనలు తెలిపారు. ఈ సర్జరీలో డాక్టర్ శివ రామ కృష్ణ, డాక్టర్ అనిల్ కుమార్, పీజీ వైద్యులు, మత్తు వైద్యులు డాక్టర్ శివరాం, పోలయ్య, విష్ణు మహేష్ పాల్గొన్నారు.

కృష్ణా నదిలో బాలుడు అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి సీతానగరం కృష్ణానదిలో మైనర్ బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. బాలుడు మృతి చెందాడ లేక హత్య లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం విజయవాడ ఇబ్రాయిల్ పేటకు చెందిన యశ్వంత్(15) స్నేహితులతో వెళ్లి శుక్రవారం కనిపించడం లేదని బంధువులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్నేహితులతో కలిసి వారధి క్రింద కృష్ణానదిలో యశ్వంత్ ఈతకు వెళ్లారని స్నేహితుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో హత్య చేసారని బందువులు తల్లిదండ్రులు ఆరోపించారు. బంధువుల ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు యశ్వంత్ స్నేహితులను విచారిస్తున్నారు. యశ్వంత్ మృతదేహాన్ని చూసి బంధువులు శోకం సంద్రంలో మునిగిపోయారు.

సాధికార కన్వీనర్ల కమిటీలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సాధికార కన్వీనర్లు అందరు రాష్ట్ర సాధికార కన్వీనర్లతో సమన్వయము చేసుకొని కమిటీలు త్వరగా పూర్తి చేయాలని జిల్లా బిసి విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా బిసి సాధికారత కన్వీనర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 18 నుండి 22 వరకు బీసీ సాధికార వర్గాలు పార్లమెంట్ లోని అన్ని నియోజకవర్గాలలో పర్యటించి టీడీపీ హయాంలో బిసిలకు జరిగిన మేలు... ప్రస్తుత ప్రభుత్వ హయాంలో బీసీలకు జరుగుతున్న నష్టాన్ని.. తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలన్నారు. బీసీలకు సబ్ ప్లాన్ ఏర్పాటు చేసిన ఏకైక ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం, రాష్ట్ర బిసి మేదరి సాధికార కన్వీనర్ ధూళిపాళ్ల యేసుబాబు, రాష్ట్ర బిసి కృష్ణ బలిజ సాధికార కన్వీనర్ కావేటి వేణుగోపాల్, గుంటూరు జిల్లా బిసి కోఆర్డినేటర్ మద్దిరాల గంగాధర్, మల్లెల ఈశ్వరరావు, మల్లె విజయ, మాదాల చిన కొండలరావు, వంగర ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల పరిధిలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో ఇబ్బందులుపడుతున్న కటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి రూ.70 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కంతంరాజు కొండూరు గ్రామానికి చెందిన ఆలూరి చిట్టియ్య రూ.15 వేలు, చిలువూరు గ్రామానికి చెందిన కాటయ్యకు రూ.20వేలు, లోకం సావిత్రి రూ.15 వేలు, దుగ్గిరాల గ్రామానికి చెందిన షేక్ నాగుర్ రూ.20 వేలను ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి చేతుల మీదుగా సాయాన్ని అందజేయించారు. జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, వైసీపీ బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ షేక్ సుభాని, సర్పంచ్‌లు ఉన్నం ఝాన్సి, బానవత్ కుషి భాయ్, నాయకులు రాజేష్, వడ్డేశ్వరపు రజినీకాంత్, ఫిలోమినా, బాబూ, వెంకటేశ్వర నాయక్, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

మహాయజ్ఞంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముస్తఫా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : విజయవాడ ఇందిర గాంధీ మున్సిపల్ స్టేడియం నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవాదాయ, ధర్మదాయ శాఖ నిర్వహణలో రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో దేవాదాయ, ధర్మాదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ సమక్షంలో జరుగుతున్న అష్టోత్తర 108వ చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహాయజ్ఞంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడవాలని, రాష్ట్ర ప్రజలు సుఖ సౌభాగ్యాలతో ఉండాలని..ప్రకృతిమాత అనుగ్రహంతో ప్రజలకు మేలు జరగాలని..శ్రీ లక్ష్మీ మహాయజ్ఞం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలందరూ ఈ యజ్ఞాన్ని సందర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ ఈమని చంద్రశేఖర్‌రెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్, గుంటూరు తూర్పు పరిశీలకులు అడపా శేషు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శక పాలన కోసమే సచివాలయాలు

విశాలాంధ్ర-తాడికొండ : ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకురావడం జరిగిందని వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. నిడుముక్కల గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం సురేష్ కుమార్ మాట్లాడారు. కులమత పార్టీలకతీతంగా పారదర్శక పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతంలో ఏ పని కావాలన్నా ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. నేడు ఆ దుస్థితి లేకుండా పోయిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో ఏ పని అయినా సక్రమంగా జరిగిందా అని నిలదీశారు. పారదర్శక పాలన అందిస్తుంటే టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచి మాదాసు రత్న కుమారి, యేసురత్నం, వైసీపీ నాయకులు బండ్ల పున్నారావు, ఎంపీటీసీ బోడపాటి సుశీల, తాళ్ల శివ నాగరాజు, గ్రామ కార్యదర్శి అలా సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు

విశాలాంధ్ర-కాకుమాను : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని టీజే మేరీ ఆధ్వర్యంలో అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం టీజే మేరీ మాట్లా డుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని, క్రమశిక్షణతో చదువుకొని అభివృద్ధి చెందాలని కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలరని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మద్దిరాల వెంకటేశ్వర్లు, టి.రవికుమార్, ఎస్.రాము, మక్కెన జవహర్ రాణి, సిహెచ్ అన్నపూర్ణయ్య, పి.గోపీచంద్, జె.సుబ్బారావు, జూపూడి ప్రకాశరావు పాల్గొన్నారు.

కర్ణాటకతో ప్రారంభమైన కాంగ్రెస్ ప్రభంజనం

విశాలాంధ్ర-గుంటూరు : కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించిన సందర్భంగా గుంటూరు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కట్టా జవహర్ బాబు ఆధ్వర్యంలో హిందూ కళాశాల సెంటర్‌లో బాణాసంచా కాల్చి అనంతరం పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు ఈశ్వరరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, నాయకులు వణుకూరి శ్రీనివాసరెడ్డి, ఉస్మాన్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పవన్ తేజ సమక్షంలో కేక్ కట్ చేసి విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జవహర్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం కర్ణాటకతో మొదలైందని, రానున్న ఎన్నికల్లో దేశమంతా కూడా ఇదే రకంగా కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సాధిస్తుందన్నారు. బీజేపీ అరాచకాలకు ప్రజలు బుద్ధి చెప్పటానికి సిద్ధపడ్డారని అన్నారు. 2024 జరగబోవు ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని అన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీలు పగడాల ప్రసాద్, చార్లెస్ ప్రదీప్, లీగల్ సెల్ సభ్యులు జగదీష్, ఇమ్మడి వెంకట్, సుధీర్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు జగదీష్ నాయుడు, చైతన్య సాయిరాం, జయరాం, మహమ్మద్ తాహ, కాసిం, శ్రీనివాస్, విశ్వతేజ, షేక్ షన్ను పాల్గొన్నారు.

దారిమళ్లిస్తున్న కార్మిక సంక్షేమ బోర్డు నిధులు

విశాలాంధ్ర-పొన్నూరు : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును కాపాడుకునేందుకు ఈ నెల 15వ తేదిన గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయ ప్రదం చేయాలని ఏఐటీయూసీ పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామా రావు అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయము వద్ద జరిగిన కార్మిక సమావేశంలో ఆరేటి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వము అధికారముకు వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నుంచి ఒక్క కార్మికుడికి కూడా సహాయము చేయలేదన్నారు. కార్మికుల డబ్బును పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా తరలించి వేరే పథకాలకు వాడుకొనటం జరిగిందని, 32 వేల క్లైములు పరిష్కరించకుండా కార్మికులను ఇబ్బందిపెట్టడం సిగ్గుచేటని అన్నారు. సమావేశానికి సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షులు పగడాల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు గుంటూరు ఏడుకొండలు మాట్లాడుతూ సంక్షేమ బోర్డులో కార్మికుల డబ్బు రూ.1200 కోట్లు ఉందని, వాటిని కార్మికులు చనిపోయిన సందర్భంలో వివాహ సందర్భాలలో ప్రసూతి సమయములో ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం హేయమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో సూరిబాబు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించండి: ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు : వెకేషన్ డిపార్ట్‌మెంట్ అయిన విద్యాశాఖలో ఉపాధ్యాయులచే వేసవి సెలవులలో పని చేయించుకొనుటను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు అన్నారు. స్థానిక ఎస్టీయూ భవన్(కంకర కుంట)లో ఎస్టీయూ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులలో ఉపాధ్యాయులకు ఎస్‌సీఈఆర్‌టీ నిర్దేశించిన బాధ్యతలకు సంబంధించి గాని, వి లవ్ రీడింగ్ కార్యక్రమాలకు సంబంధించి గాని, పదవ తరగతి పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించుటకు సంబంధించి గాని విద్యాశాఖ కమిషనర్ నుంచి డీఈఓల నుంచి ప్రధానోపాధ్యాయుల ద్వారా ఉపాధ్యాయులకు ఎటువంటి రాతపూర్వక ఉత్తర్వులు ఇవ్వకుండానే మౌఖిక ఆదేశాలతోనే ఈ కార్యక్రమాలకు సంబంధించి మొత్తం వేసవి సెలవులలో పనిచేయించుకుంటున్నారని, ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అవసరమైతే మిగిలిన డిపార్ట్‌మెంట్ల మాదిరిగానే విద్యాశాఖను కూడా నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించి ఉపాధ్యాయులచే అన్ని రకాల కార్యక్రమాలను నిర్వహించుకుని సంపాదిత సెలవులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేగాని వేసవి సెలవులలో అన్ని రకాల కార్యక్రమాలకు ఉపాధ్యాయుల చేత వెట్టిచాకిరి చేయించుకోవడం తగదని విమర్శించారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీలను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ప్రతిపాదికన ఉపాధ్యాయ పదోన్నతులను కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వేసవి సెలవులు ముగిసేలోగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్టీయూ నాయకులు పి.యాకోబు, శ్రీనివాస్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

సీపీఐ పోరాట ఫలితం... స్థానికుల కల సాకారం

విశాలాంధ్ర-గుంటూరు : నగరంలోని కాకుమానువారి తోటలో ఉన్న వెల్ఫేర్ సెంటర్ అభివృద్ధి కోసం సీపీఐ సాగించిన పోరాట ఫలితంగా స్థానిక ప్రజల కల సాకారమైందని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. నేడు వెల్ఫేర్ సెంటర్‌లో ముళ్ళ కంపలను తొలగించి అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వెల్ఫేర్ సెంటర్ స్థలంలో జరుగుతున్న వాకింగ్ ట్రాక్ పనులను సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, వైసీపీ నాయకులు శ్రీనివాసరావులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ వెల్ఫేర్ సెంటర్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసిన స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ ఆధ్వర్యంలో అనేక రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేయడంతో పాటు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందన్నారు. స్పందించిన అప్పటి ప్రభుత్వం వెల్ఫేర్ సెంటర్‌లోని ఆరు ఎకరాల భూమిని హాస్పిటల్‌కు కేటాయించిందని, ఆ తరువాత ప్రభుత్వం మారిపోవడం జరిగిందన్నారు. దీంతో సీపీఐ తిరిగి తన పోరాటాన్ని ప్రారంభించిందని హాస్పిటల్ నిర్మాణం ప్రారంభించాలని, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని వైసీపీ ప్రభుత్వ పెద్దల దృష్టికి సమస్యను తీసుకువెళ్లడం జరిగిందన్నారు. నేడు ఆ కల సాకారమైందని చెప్పారు. దీనికి సహకరించిన ఎమ్మెల్యే ముస్తఫా, అధికారులకు కోట మాల్యాద్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యశ్వంత్, రావుల అంజి బాబు, ధూపాటి వెంకటరత్నం, లింగాయదుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధతలేని సీపీఎస్ రద్దు చేయాలి

విశాలాంధ్ర-దుగ్గిరాల : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాషా అధ్యక్షత వహించి కార్యవర్గ సమావేశంలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల మీద మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించని యెడల ఈ నెల 22వ తేదీ నుంచి ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నట్టు తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనర్ల పెన్షన్స్ అన్ని ఒకటో తారీఖున అందే విధంగా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధతలేని సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. గుంటూరు నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు వి.పెదరత్తయ్య, దుగ్గిరాల తాలూకా యూనిట్ అధ్యక్షులు అందె బాల చంద్రమౌళి, సహాధ్యక్షులు వంకదార సుబ్బారావు, ఉపాధ్యక్షులు దమ్ము ఆశీర్వాదమ్మ, సంయుక్త కార్యదర్శి బొల్లంపల్లి బుజ్జి, సుజాత, గుండిమెడ శ్రీనివాసరావు, సుదర్శనశాస్త్రి, గంగవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హజ్ యాత్ర విషయంలో రాజకీయం తగదు

విశాలాంధ్ర-దుగ్గిరాల : ముస్లింలు పవిత్రంగా భావించే హజ్ యాత్ర టికెట్ ధరల విషయంలో రాజకీయ లబ్ది కోసం ప్రతిపక్ష నేతలు రాష్ట్ర ప్రభుత్వం పెంచినట్టు మాట్లాడటం తగదని వైసీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. దుగ్గిరాలలో శనివారం ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హజ్ యాత్రకు ధరలు నిర్ణయించేది సెంట్రల్ హజ్ కమిటీ అని, ఇందులో రాష్ట్ర కమిటీకి కాని, రాష్ట్ర ప్రభుత్వానికి గానీ ఎలాంటి సంబంధం ఉండదన్నారు. హజ్ యాత్ర టికెట్ ధరల తగ్గింపు విషయంలో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడిందని, కేంద్రం తగ్గించని పక్షంలో రాష్ట్రమే ఆ మొత్తాన్ని భరిస్తుందని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేసారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్న జగన్ ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ జానీ, షేక్ రఫీద్, షేక్ హుసేన్, పఠాన్ మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-చేబ్రోలు: మొక్క జొన్న పంట కొనుగోలు వేగవంతం చేయాలని తెనాలి ఇచార్జి సబ్ కలెక్టర్ శిమన్నారాయణ శర్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని వడ్లమూడి గ్రామంలో శనివారం ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన మొక్కజొన్న, తెల్ల జొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33శాతం కన్న ఎక్కువ దెబ్బతిన పంటల వివరాలు రైతు భరోసా కేంద్ర సిబ్బంది వెంటనే పంపించాలన్నారు. ఇప్పటికే మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొక్క జొన్న కొనుగోలు వేగవంతం చేయాలని సూచించారు. ఏఓ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రైతు భరోసా పీఎం కిసాన్ లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించాలన్నారు. రైతులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విడుదల కానున్న 15వ ఆర్థిక సంస్థ నిధులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక సంస్థలకు, గ్రామ పంచాయతీలకు 2022-2023 15వ ఆర్థిక సంఘం నుంచి రావలసిన కేంద్ర నిధులు త్వరలో విడుదలకానున్నాయని కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి విజయ్ కుమార్ వెల్లడించినట్లు అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ)జాతీయ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని జీవన్ ప్రకాష్ బిల్డింగులో ఉన్న కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి విజయ కుమార్‌ను ఆయన ఛాంబర్‌లో జాస్తి వీరాంజనేయులు కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు నిధులు లేక పడుతున్న ఇబ్బందులను కేంద్రం పంచాయతీరాజ్ శాఖ అధికారులకు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు 15 ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్ర ఆర్థికశాఖకు ఫైల్‌ను రికమండ్ చేసి పంపామని, త్వరలో బదిలీ అవుతాయన్నారు.

రైతుల పాదయాత్రకు పోలీసుల ఆంక్షలు

విశాలాంధ్ర-తుళ్ళూరు : రాజధాని ప్రాంతం తుళ్లూరులో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్-5 జోన్‌కు వ్యతిరేకంగా జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు, న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్, అమరావతి రైతులు అంబేడ్కర్ స్మృతి వనానికి పాదయాత్రగా వెళ్లాలని సంకల్పించారు. మరోవైపు తుళ్లూరులోని దీక్షా శిబిరం వద్దకు భారీగా పోలీసుల్ని మోహరించి.. నిరసన చేస్తున్న రైతులను అడ్డుకున్నారు. శాంతియుతంగా చేసే పాదయాత్రకు పోలీసుల ఆంక్షలేంటని రైతులు ప్రశ్నించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. కొంతమంది రైతులు దీక్షా శిబిరం వెనుక వైపు నుంచి పొలాల్లోకి వెళ్లి అక్కడ నుంచి స్మృతివనం చేరుకున్నారు. అనంతరం అమరావతి ఐకాస నేతలు స్మృతివనం వద్దకు వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నినాదాలు చేసి నిరసన తెలిపారు.

ఆర్-5 జోన్ జంగిల్ క్లీనింగ్ పనులు

విశాలాంధ్ర-తుళ్లూరు: రాజధాని ప్రాంతంలో పేదలకు సెంటు భూమి ఇవ్వడానికి ప్రభుత్వం ఆర్-5 జోన్ ప్రాంతాల్లో జంగిల్ క్లీనింగ్ పనులను వేగవంతం చేస్తుంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాజధానిలో ఇళ్ల పట్టాల పంపిణీకి అధికారులు లే అవుట్‌లను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

విశాలాంధ్ర-రొంపిచర్ల : సంతగుడిపాడు గ్రామంలో గల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 2001-02 విద్యాసంవత్సరం పదవతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల మొత్తం కలయతిరిగి తరగతిగదులలో ఉపాధ్యాయులతో గడిపిన మధురక్షణాలను నెమరువేసుకొన్నారు. ఒక్కొక్కరిని గుర్తు పెట్టుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకుని జోక్స్ వేసుకుంటూ సరదగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులు మురళీధర్, పుల్లయ్య, వెంకటకోటయ్య, కల్లూరు శ్రీనివాసరావులను ఘనంగా సన్మానించారు.

ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు పెంచాలి

విశాలాంధ్ర-రొంపిచర్ల : ఉపాధి హామీకూలీలకు పనిదినాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి అన్నారు. మండలంలో సంతగుడిపాడు, తుంగపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆదివారం పరిశీలించారు. ఉపాధిహామీ కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. వామపక్షాలు పోరాటాల ఫలితంగా ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టారని, పాతపద్ధతిలో అమలుచేయాలని అన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూలీలకు పనిప్రదేశాలలో వసతి సౌకర్యాలు కల్పించి అలవెన్స్ ఇవ్వాలని అన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బత్తుల బాలకోటయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజు, భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు పలపల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-రాజుపాలెం : మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్ మాచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న కొప్పుల శ్రీనివాసరెడ్డి అరుణ 16వ మ్యారేజ్ డే సందర్భంగా రాజుపాలెం మండలం కొండమోడు పరిధిలోని దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న అనాధ బాలురు ఆశ్రమం పిడుగురాళ్ల పరిధిలోని దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న వర్షిత ఓల్డ్ ఏజ్ డే కేర్ సెంటర్‌లో వారి ఆర్థిక సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం చైర్మన్ గరికిపాటి శంకర్రావు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక రైల్వే స్టేషన్‌లో శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి తిరుపతి నుంచి గుంటూరు వెళ్లే రైలు క్రింద పడి మృతి చెందాడు. మృతుడు యర్ర టీ షర్ట్ కాఫి కలర్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు అతని వయస్సు దాదాపు 60 యేళ్లు ఉండవచ్చని మృతదేహాన్ని పోస్ట్ మర్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి తరలించమని నరసరావుపేట జి.ఆర్.పి సబ్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు తెలిపారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఎవరైనా గుర్తు పడితే వినుకొండ రైల్వే స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

పల్లెలకు పోదాం... పెద్దలను కలుద్దాం!

విశాలాంధ్ర-అచ్చంపేట : మిషన్ 50 ద్వారా పల్లెలకు పోదాం పెద్దలను కలుద్దాం అంటూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ అన్నారు. అచ్చంపేట ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి సురేష్ మాదిగ పర్యటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మండల కేంద్రాల్లో గ్రామ గ్రామాన మిషన్ 50 ద్వారా మాదిగ పల్లెల్లోకి వెళ్లాలని సురేష్ కోరారు. యువతలో చైతన్యం తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ సాధన కోసం కృషి చేయాలని అన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

విశాలాంధ్ర-అచ్చంపేట : మండలంలో రీ సర్వే జరుగుతుందని రైతులు అధికారులకు సహకరించాలని తహశీల్దార్ పద్మాదేవి కోరారు. రీ సర్వే ద్వారా ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలు కూడా పరిష్కరించబడతాయని తెలిపారు. ప్రతి రైతుకు ఖాతా నెంబర్ ఇచ్చి ప్రత్యేక సర్వే నెంబరు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించే వీఆర్వోలకు రైతులు సహకరించాలని కోరారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-అచ్చంపేట : అకాల వర్షాలకు రైతులు పంటను కాపాడుకోలేకపోయారని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని మండల సీపీఐ కార్యదర్శి మధుబాబు డిమాండ్ చేశారు. సీపీఐ సీనియర్ నాయకులు పున్నా కోటేశ్వరరావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చెట్లను తొలగించిన సిబ్బంది

విశాలాంధ్ర-అచ్చంపేట : మండల కేంద్రంలో విద్యుత్ లైన్‌లకు అడ్డంగా ఉన్న చెట్లను కరెంటు సిబ్బంది తొలగించారు. ఈదురు గాలులు వడగాలుకులకు కొమ్మలు విరిగిన తీగలపై పడి కరెంటుకి అంతరాయం కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏఈ శివకోటి రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు మరమ్మత్తులు జరుగుతాయని ఏఈ తెలిపారు. వినియోగదారునికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా విద్యుత్ అందించటమే ధ్యేయమని ఆయన తెలిపారు.

వలసలు నివారించేందుకే ఉపాధి హామీ పనులు

విశాలాంధ్ర-అచ్చంపేట : వలసలను నివారించేందుకే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఏపీవో నాగ శ్రీనివాస్ తెలిపారు. కూలీలు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, కర్షకులు వేసవికాలం సమయంలో పనులు లేక ఇబ్బందులు పడకూడదు అనే ఉద్దేశంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టిందని ఈ అవకాశాన్ని అన్ని గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని ఏపీఓ కోరారు. కొలతల ప్రకారం పని ఉంటుందని పనికి తగ్గ వేతనం ఉంటుందన్నారు.

లోక్ అదాలత్‌లో 140 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర-పొన్నూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ నేలపాడు, అమరావతి వారి ఆదేశాల మేరకు శనివారం పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగింది. పొన్నూరు కోర్టుల ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు 32, సివిల్ కేసులు 16, ఎన్ఐ యాక్ట్ కేసులు 1, బ్యాంకు పీఎల్‌సీ కేసులు 16, ఎస్‌టీసీ కేసులు 73, ఎంసీ కేసులు 2 పరిష్కరించుకోవడం జరిగిందని, తద్వారా రూ.65,60,900లు లావాదేవీల పరిష్కారం జరిగిందని కక్షిదారులు వ్యయప్రయాసలకు లోనుకాకుండా ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవడం జరిగిందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్ తెలిపారు. పొన్నూరు కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జీవో1 కొట్టివేత ప్రభుత్వానికి చెంపపెట్టు: మారుతి

విశాలాంధ్ర-వినుకొండ: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ జీవో నెంబర్ ఒకటిపై వేసిన రిట్ పిటిషన్ ఫలితంగా హైకోర్టులో జరిగిన న్యాయ పోరాటంలో జీవోను కొట్టి వేయడాన్ని రాష్ట్ర ప్రజలందరూ హర్షిస్తున్నారని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. శనివారం పత్రిక ప్రకటనలో హైకోర్టు తీర్పును స్వాగతిస్తూ హర్షం వెలిబుచ్చుతూ, రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి అక్రమంగా ప్రజాస్వామ్య విరుద్ధంగా తీసుకువచ్చిన జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలని సీపీఐ రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేసిందన్నారు. ఈ తీర్పును రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు ప్రజాస్వామ్యవాదులందరూ స్వాగతిస్తున్నారని అన్నారు. మన రాజ్యాంగం దేశంలో, రాష్ట్రంలో ప్రజలు ప్రశ్నించే హక్కు మాట్లాడే హక్కు సభలు సమావేశాలు పెట్టుకునే హక్కులు భావ ప్రకటన స్వేచ్ఛను కల్పించిందని అలాంటి ప్రజాస్వామ్య రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాయడానికి నియంతృత్వ పోకడలు పోతున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఈ తీర్పు చెంపపెట్టువంటిదని, రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా నియంతత్వ పోకడలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఇటువంటి పోకడలను ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా వ్యతిరేకించాలని ఆయన కోరారు.

బీజేపీ నియంతృత్వ పోకడలకు చెక్

కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘోర పరాభవం, కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం దేశంలో భారతీయ జనతా పార్టీ మతోన్మాద విధానాలు రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలపై అవినీతిపై ప్రజలు ఇచ్చిన తీర్పని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. శనివారం కర్ణాటక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా బిజెపి అధికారంలోకి వచ్చింది మొదలు దేశంలో బీజేపీ రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యతిరేక నిరంకుశ విధానాలు అవలంబిస్తూ రాష్ట్రాలకు ఉన్న హక్కులను కాలరాస్తూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రజలకు వాగ్దానాలు ఇచ్చి ప్రత్యేక హోదా ఇవ్వకపోగా రాష్ట్ర రాజధానికి, వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వలేదని పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా అడుగు కదలకుండా చేస్తున్నారని విశాఖ రైల్వే జోన్ ఇవ్వకపోగా చారిత్రక పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కార్పొరేట్ కంపెనీలకు అమ్మచూపుతున్నారని ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని తన మిత్రులైన అంబానీ ఆదానిలకు అప్పచెప్పుతున్నారని సామాన్య ప్రజలపై అధిక పనుల భారాలను మోపుతూ పెట్రోల్ డీజిల్ గ్యాస్ రేట్లను నిత్యవసర సరుకుల ధరలను అత్యంత దారుణంగా పెంచి వేశారని సామాన్యుడు జీవించే పరిస్థితి లేదని ఈ సందర్భంగా ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో జరిగిన కర్ణాటక ఎన్నికలు బిజెపికి బుద్ధి చెప్పాయని 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలు కూడా ఇదే పునరావృతమై దేశ ప్రజలు మట్టి కరిపిస్తారని ఆయన అన్నారు. దేశంలోని అన్ని రాజకీయ లౌకికవాద పార్టీలన్నీ ఏకమై మతోన్మాదాన్ని నిరంకుశత్వాన్ని ఓడించటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

అధికారులపై ఆజాద్‌నగర్ వాసుల ఆగ్రహం

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక మసీదు మాన్యం ఆజాద్ నగర్‌లో గత 15 ఏళ్లుగా ఇళ్ళు నిర్మించుకుని నివశిస్తున్నామని ఇక్కడి నుంచి మేము కదిలేది లేదంటూ వందలాది మంది మహిళలు, పేద కుటుంబలు వక్ఫ్ బోర్డు అధికారుల ముందు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వక్ఫ్ బోర్డు అధికారులు స్పెషల్ ఆఫీసర్ ఎస్కే షీరిన్ బేగం, స్టేట్ ఇంచార్జ్ సీఈవో నూర్ సాహెబ్, స్థానిక మున్సిపల్ చైర్మన్ దస్తగిరి షకీలా స్థానిక అధికారులు మసీదు మాన్యం ఆజాద్ నగర్‌లో సందర్శించారు. వక్ఫ్ బోర్డు స్థలంలో ఉంటే ఎలా మీరు ఖాళీ చేస్తే జగనన్న కాలనీలో ఇల్లు నిర్మిస్తామంటూ బాధితులకు చెప్పబోయారు. దీంతో బాధితులంతా ఒక్కసారిగా అధికారులను చుట్టుముట్టి మేము ఎలా ఖాళీ చేస్తాం 15 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, 5 వేల కుటుంబాలు ఇళ్లు నిర్మించుకున్నామని, కరెంటు ఇచ్చారు బిల్లులను కూడా కడుతున్నామని, మున్సిపాలిటీ ద్వారా మాకు అన్ని వసతులు కల్పించాలంటూ అధికారులకు మొరపెట్టుకున్నారు. దీంతో ఖంగు తిన్న అధికారులు రెండు వీధులు తిరిగి చూశారు నిర్మాణం జరిగిన ఇళ్లను ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఇక ఈ విషయాన్ని కలెక్టర్‌కు చెప్తామంటూ అధికార బృందం వెనుతిరి గారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ షీరిన్ బేగం మాట్లాడుతూ ఏనుగుపాలెం రోడ్డులో, తిమ్మాయపాలెం రోడ్డులో మొత్తం 111 ఎకరాల వక్ఫ్ బోర్డు భూములు ఉన్నాయని ఇవన్నీ ఆక్రమణలు జరుగుతున్నాయని నెల రోజుల్లో భూములన్నీ తిరిగి వక్ఫ్ బోర్డుకి అప్పగించాలని అన్నారు. ఆ భూముల్లో ఉన్న కుటుంబాలకు జగనన్న కాలనీలో ఇల్లు నిర్మాణం చేపిస్తామన్నారు.

జనసేనలోకి భారీగా చేరికలు

విశాలాంధ్ర-వినుకొండ: నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలంలోని రేమిడిచర్ల గ్రామానికి చెందిన 18 కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయని స్థానిక పార్టీ కార్యదర్శి నిశ్శంకరావు శ్రీనివాసరావు తెలిపారు. వారికి కండువా కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రానున్నది జనసేన ప్రభుత్వమని, యువతకీ అధిక ప్రాధాన్యత జనసేన ద్వారానే సాధ్యమని, పవన్ కళ్యాణ్‌ని నమ్మి పార్టీలో చేరిన వారికీ పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. అనంతరం అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మ హత్యాయత్నం చేసుకున్న గోకనకొండ గ్రామానికి చెందిన జనసేన క్రియా శీలక కార్యకర్త కొండి వెంకటేశ్వర్లుని హాస్పిటల్‌లో పరామర్శించారు. శ్రీనివాస్... అతనికి, అతని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఆర్థిక సాయం అందించారు. ఈపూరు మండలాధ్యక్షులు పొనపాల నరసయ్య, బొల్లాపల్లి మండల ఉపాధ్యక్షులు యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, వినుకొండ మండల నాయకులు తాతపూడి రాంబాబు, ఉపాధ్యక్షులు ముసిమి రాజేంద్ర, మండల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక కొత్తపేట శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో లక్షాకు పూజ ఘనంగా నిర్వహించారు. ఉభయ దాతలుగా తీగల రవీంద్రబాబు, నాగే నాగేశ్వరమ్మ వ్యవహరించారు. రాత్రి 7 గంటలకు అంగరంగ వైభవంగా స్వామి బ్రహ్మోత్సవం జరిగింది. కనక తప్పెట్లు, భాజాభజంత్రీలు, ధూపదీప నైవేద్యాలు, బాణాసంచా, కోలాటం, కేరళ నాట్యం, వరాహి రూపు నాట్యం, చెక్కభజన, కర్ర సాము వంటి వివిధ రకాల కళాకారులతో స్వామి విశేష గ్రామోత్సవం జరిగింది. ఆలయంలో మధ్యాహ్నం వందలాదిమంది స్వాములకు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. గ్రామోత్సవం ఆలయం నుంచి బయలుదేరి నాజ్‌సెంటర్, కొత్తపేట రంగా బొమ్మ సెంటర్, కొత్తపేట శివాలయం, పశువుల వైద్యశాల, పాత బస్టాండ్, జిన్నా టవర్ సెంటర్, కృష్ణ మహల్ మీదుగా ఆలయానికి చేరుకుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.శ్రీనివాసరావు, శ్రీ హనుమాన్ సేవా సమాజ గౌరవాధ్యక్షులు తిరువల్లూరి వెంకటసుబ్బారావు, అధ్యక్షులు చేపల నాగేశ్వరరావు, కోశాధికారి నరెడ్ల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో సహజవనరుల దోపిడీ

విశాలాంధ్ర-గుంటూరు : వైసీపీ ప్రభుత్వంలో సహజవనరుల దోపిడీ జరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షతన గుంటూరు మార్కెట్ సెంటర్ వద్ద వైసీపీ ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల అవినీతి, అక్రమాలపై అభియోగాల స్వీకరణ, ప్రజా చార్జిషీట్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన సోము వీర్రాజు మాట్లాడుతూ ఆయుర్వేద కళాశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి కనీసం సమీక్ష కూడా చేయడం లేదన్నారు. సాంప్రదాయ వైద్య విధానంపై ముఖ్యమంత్రి వైఖరి ఏమిటని ప్రశ్నించారు. ఆయుష్ ఆసుపత్రిని కట్టడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నా రాష్ట్రం స్థలం ఇవ్వటానికి సిద్ధంగా లేదని అన్నారు. నేచురల్ క్యూర్ విధానాలను పూర్తిగా పక్కన పెట్టారని చెప్పారు. ఎయిమ్స్ కూడా నీరు ఇవ్వడం లేదన్నారు. కేంద్రం నిధులు ఇచ్చిన అభివృద్ధి పనులు చేయడం లేదని అన్నారు. గుంటూరు కార్పొరేషన్‌కు ఇచ్చిన నిధులు ఏమి చేశారని నిలదీశారు. టిడ్కో ఇళ్ళను లబ్దిదారులకు ఇవ్వకపోవడం అనేది పెద్ద అవినీతి కార్యక్రమమని అన్నారు. ప్రభుత్వ అవినీతికి సంబంధించి అన్ని సాక్ష్యాలను సేకరిస్తున్నామని, అన్ని అంశాలపై చార్జిషీట్ వేస్తామని, 19న గన్నవరం సమావేశంలో రాష్ట్ర స్థాయి చార్జ్‌షీట్ ప్రకటిస్తామని అన్నారు. ప్రభుత్వ అవినీతి, అసమర్థ కార్యక్రమాలను ఎండగడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తోట రామకృష్ణ, చందు సాంబశివరావు, జూపూడి రంగరాజు, యడ్లపాటి స్వరూపరాణి, మకుటం శివ, ధారా సాంబయ్య, టీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 1 రద్దుపై అఖిలపక్షం హర్షం

విశాలాంధ్ర-పెదకూరపాడు : రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో తీసుకువచ్చిన జీఓ 1ను హైకోర్టు రద్దు చేయడంపై పెదకూరపాడు అఖిలపక్ష రాజకీయ పార్టీ నాయకులు, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అత్తిమల రమేష్, సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు గంట గోపి, జనసేన నాయకులు మల్లా చలపతిరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కంచర్ల జాన్ బాబు, క్రోసూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బెల్లంకొండ రాంగోపాలరావు, వడ్లమూడి అప్పారావు శనివారం ఏర్పాటుచేసిన విలేకరు సమావేశంలో మాట్లాడుతూ జీవో 1 పౌర ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా ఉందని కోర్టు ప్రకటించడం ప్రజాస్వామ్యం విజయమని అన్నారు. అదేవిధంగా సభలు, ప్రదర్శనలు జరుపుకోవాలని నిరసన తెలపడం లాంటి హక్కులను ప్రభుత్వాలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్బంధ విధానాలను విడనాడి చర్యల ద్వారా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి పి.రాజు, మద్దినేని సత్యనారాయణ, భాష్యం ఆంజనేయులు, షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలోనే మొక్కజొన్న కొనుగోలు

విశాలాంధ్ర-రాజుపాలెం : గతంలో రైతులు తాము పండించిన పంటలను విక్రయించుకునేందుకు నియోజకవర్గ కేంద్రానికి, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన విప్లవాత్మకమైన పరిపాలన సంస్కరణలతో రైతు భరోసా కేంద్రాల ద్వారా స్థానికంగానే పంటలను, తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం ఉందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆర్‌బీకేలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్రాప్‌లో నమోదైన ప్రతి రైతుకు ఇక్కడ తమ పంటలను విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ముందుగా తూకపు యంత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రైతులతో మాట్లాడారు. మొక్కజొన్నలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

లోక అదాలత్‌లో 262 కేసుల పరిష్కారం

విశాలాంధ్ర-మాచర్ల: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ వేదికపై 262 కేసులు పరిష్కారమైనట్లు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షులు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎన్ శారద తెలిపారు. జడ్జి శారద మాట్లాడుతూ కక్షిదారులు తమ అమూల్యమైన సమయాన్ని జైళ్ళలో గడపకుండా రాజీమార్గంలో కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ వేదికలు దోహదపడతాయన్నారు. ఈ క్రమంలోనే సివిల్ 11, ఇ.పీ 5, క్రిమినల్ 61, చెక్ బౌన్స్ 8, భరణం 4, ఎస్.టి.సి 167, ప్రీలిటికేషన్ 6 కేసులను పరిష్కరించినట్లు ఆమె పేర్కొన్నారు. వాటి విలువ రూ.60,28,154లు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బి.వి నరసింహారావు, జూపల్లి శ్రీనివాసరావు, శీలం వెంకటేశ్వర్లు, ఎ.పి.పి గొర్రె వెంకటేశ్వర్లు, రాము నాయక్ సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-శావల్యాపురం: స్థానిక జడ్పీ పాఠశాలలో 1997-98 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాలలో నివాసముంటున్న 60 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులు పాఠశాలలో ఒకేచోట చేరి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకొన్నారు. తొలుత విద్యార్థులంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని, ప్రస్తుతం వారి జీవిత విశేషాలు, కుటుంబ వివరాలు గురించి పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాల్యంలో తాము చేసిన అల్లర్లు, ఉపాధ్యాయులచే తిన్న చివాట్లు, విద్యాబోధన తదితర అంశాలను జ్ఞాపకం చేసుకొంటూ కొంతసేపు ఆనందంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులు హనుమంతరావు, నాగేశ్వరరావు, రాంబాబు, యోగయ్య, పద్మేశ్వరరావులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాల మైదానం లోతట్టుగా ఉండడాన్ని గమనించిన పూర్వ విద్యార్థులు మెరక లేపేందుకు తమవంతు సహకారం అందించనున్నట్లు ప్రకటించారు. పూర్వ విద్యార్థులు బొందిలిపాలెం సర్పంచ్ బోడాల వీరాంజనేయులు, నిడదవోలు రామారావు, బోడాల వీరయ్య, మర్రి దుర్గారావు, చెన్ను కోటేశ్వరరావు, ముంద్రు బ్రహ్మయ్య, పోట్ల హనుమంతరావు, సూరె అచ్చమ్మ, కర్రి అనూరాధ, జాలాది ఉష, చొరవ తీసుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు.

యువగళం పాదయాత్రకు మద్దతు తెలపండి

విశాలాంధ్ర-అచ్చంపేట: యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 15న నియోజకవర్గంలో అచ్చంపేట మండలం వేల్పూరు నుండి క్రోసూరు వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని మండల టీడీపీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం తెలిపారు. నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మలపాటి శ్రీధర్ పాల్గొంటున్నారని, టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు.

పర్యావరణ రహిత శైలిపై అవగామన సదస్సు

విశాలాంధ్ర-రాజుపాలెం: రాజుపాలెం దేవరంపాడు ఏకో పార్కు నందు పర్యావరణ రహిత శైలిపై అవగాహన సదస్సు జరిగింది . ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా డిప్యూట్ రేంజర్ ఆఫీసర్ నీలిమ దేవి పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇంధనం పొదుపు, పరిసరాలు పరిశుభ్రత, ఆహారం అలవాట్లు మార్పులు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గుండ్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎస్. గోవిందరాజులు సభాధ్యక్షులుగా నిర్వహించారు. అవగాహన కల్పించి వారిచే ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవరంపాడు దేవా స్థాన ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల వైఎస్ఆర్ పార్టీ కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు , దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ గరికపాటి శంకర్రావు, యేసు బాబు, వర్ల సాంబశివరావు, అల్లా బక్షులు పాల్గొన్నారు.

విద్య, వినయం, క్రమశిక్షణతో ఉన్నత స్థానం : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: విద్యా, వినయం, క్రమశిక్షణ కలిగి ఉన్న ప్రతి వ్యక్తి ఉన్నత స్థానాలకు చేరుకుంటారని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. నరసరావుపేట కలెక్టరేట్ ఆవరణలో పల్నాడు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 2022 -23 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో విజయం సాధించిన విద్యార్థుల అభినందన సభను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్నాడు కలెక్టర్ శివ శంకర్ లోతేటి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్న బహిరంగ సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక విద్య దశనుంచే పుస్తక పఠనంతో పాటు తరగతి పాఠ్య పుస్తకాలపై పూర్తిస్థాయి అవగాహనను పెంచుకోవాలని విద్యార్థినీ, విద్యార్థులకు సూచించారు. సమాజంపై అవగాహన, తల్లిదండ్రుల పట్ల ప్రేమ, పెద్దలపై గౌరవం, స్నేహితుల పట్ల నమ్మకం, ఉన్నత చదువులపై అభిలాషను ప్రతి ఒక్కరూ పెంచుకోవాలని పిలుపు నిచ్చారు. భవిష్యత్తు తరాలపై బాధ్యతను పెంచుకొని, సమాజానికి సేవ చేసే అవకాశాలను అందిపుచ్చు కోవాలని సూచించారు. చదువుతో పాటు, సమాజంలో జరుగుతున్న ప్రతి అంశంపై విద్యార్థులు అవగాహన పెంచుకొని, భవిష్యత్ తరానికి మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ భారత దేశానికి రాష్ట్రపతిగా పనిచేసిన ఏ.పీ.జే అబ్దుల్ కలామ్ జీవితం అందరికీ ఆదర్శ మన్నారు. సాధారణ జీవన విధానం నుండి వచ్చి, క్రమ శిక్షణతో ఉన్నత చదువులు చదివి, రాష్ట్రపతిగా ఎదిగిన తీరు ప్రతి ఒక్కరూ గర్వించదగిన అంశం అన్నారు. అటువంటి మహనీయులు పుట్టిన భారత దేశంలో అంది వస్తున్న అవకాశాలను వినియోగించుకొని, విద్యలో రాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకొని, జీవితాలను సార్థకం చేసుకొని, సమాజానికి సేవ చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పలువురు వక్తలు స్ఫూర్తిదాయక ప్రసంగం అందించి, పల్నాడు జిల్లాలో పదవ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థిని విద్యార్థులను ఘనంగా సత్కరించి, ప్రశంస పత్రం, దివంగత భారత మాజీ రాష్ట్రపతి ఏ.పీ.జే. అబ్దుల్ కలామ్ పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ అతిథులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ శాఖ అధికారి వినాయకం, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్, జిల్లా అభివృద్ధి అధికారిణి మహాలక్ష్మి, విద్యాశాఖ అధికారులు, విద్యార్థినీ,విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి

విశాలాంధ్ర-ముప్పాళ్ల : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శనివారం మండలంలోని చాగంటివారిపాలెంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ మొక్కజొన్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధరకు అమ్ముకోవా లన్నారు. రైతుల సంక్షేమమే పరమావధిగా ఈ ప్రభుత్వం కొనసాగుతుం దన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రెండు పంట లకు సాగునీరు అందించిన ఘనత కూడా వైఎస్సార్ ప్రభుత్వానిదేన న్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్ చైర్మన్ కళ్ళం శివరామిరెడ్డి, మండలాధ్యక్షురాలు మారూరి పద్మావతి రామలింగారెడ్డి, జడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ, శిరిగిరి గోపాలరావు, బాబూరావు, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు

విశాలాంధ్ర-పెదకూరపాడు : కర్ణాటకలో కాంగ్రెస్ అత్యధిక మెజారిటీతో విజయం సాధించటంతో నియోజక వర్గ కేంద్రమైన పెదకూరపాడు జెండా చెట్టు సెంటర్‌లో పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా గోపి బాణసంచా కాల్చి, తీన్మార్ డప్పులతో మిఠా యిలు పంపిణీ చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంటా గోపి మాట్లాడుతూ రాహుల్ గాంధీ పట్ల, కాంగ్రెస్ పట్ల కర్ణాటక ప్రజలు చూపించిన అభిమానానికి ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. రాహుల్ ప్రధాని కావాలని దేశం అంతా కోరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహీం, నియోజకవర్గ నాయకులు బొల్లారం సుభాని, మండల యూత్ నాయకులు దేశాల అనిల్, గొర్రె చంద్రం, మల్లెల వెంకట్, అష్రాఫ్, మౌళి, మల్లెల గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని తమ్మవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ వీరాభిమానులు నందిగాం కోటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. కొన్ని రోజుల క్రితం సొంగ వెంకట్రావు అనారోగ్యంతో మృతి చెందగా గ్రామ నాయకులు ద్వారా విషయం తెలుసుకున్న పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ వారి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి సానుభూతి తెలియజేశారు. వెంకట్రావు పిల్లలు చదువుల నిమిత్తం ఆర్థిక బాధ్యతను తాను చూసుకుంటానని తెలియజేశారు. శ్రీధర్ సూచనల మేరకు మండల పార్టీ అధ్యక్షులు అర్తిమల్ల రమేష్, బెల్లంకొండ రామ్‌గోపాల్, వడ్లమూడి అప్పారావు చేతుల మీదుగా రెండు కుటుంబాలకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించారు. గ్రామ పార్టీ నాయకులు బాజీ సలాం, నందిగా దేవదాసు, పసుపులేటి శేషగిరిరావు, నరసింహారావు, రాంబాబు, హరిబాబు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రకు సంఘీభావం

విశాలాంధ్ర-వినుకొండ: టీడీపీ యువ నేత నారా లోకేష్ బాబు యువ గళం పాదయాత్ర మే 15న 100 రోజులు విజయవంతంగా పూర్తి చేసుకోనుందని పలనాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక గెస్ట్ హౌస్‌లో శనివారం జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు అన్ని నియోజకవర్గాల్లో సంఘీభావంగా ఏడు కిలోమీటర్లు పాదయాత్ర చేస్తారన్నారు. సోమవారం జరిగే యువగళం సంఘీభావ యాత్రకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుండి పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి టిడిపి శ్రేణులు పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికీ తీసుకువెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని వివరించారు. కార్యక్రమంలో పెమ్మసాని నాగేశ్వ రావు, ముంద్రు సుబ్బారావు, గుంటూర్ సాంబశివరావు,మీసాల మురళీకృష్ణ యాదవ్,జరపల్ గోవిందు నాయక్, అయుబ్ ఖాన్,శమ్మీం ఖాన్,తిరుమల శెట్టి బాలయ్య,అకుమల్ల కాసిం,లగడపాటి వెంకటరావు,గన్నమనేనీ వెంకయ్య,బత్తుల వెంకటేశ్వర్లు,గడిపూడి విశ్వనాథం పాల్గొన్నారు.

పథకాల సృష్టికర్త వైఎస్ జగన్

విశాలాంధ్ర-దుర్గి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలను ఆయన ప్రవేశపెట్టి సంక్షేమ పథకాల సృష్టికర్తగా నిలిచారని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాదు అన్నారు. శనివారం ఆయన గుంటూరు నుంచి నాగార్జునసాగర్ వెళ్ళుతూ మార్గమధ్యలో దుర్గి బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. పార్టీ నాయకులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాణిక్యవరప్రసాదును శాలువాలతో సన్మానించారు. తొలుత ఎమ్మెల్సీకి పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీని సన్మానించిన వారిలో జడ్పీటీసీ శెట్టిపల్లి యల్లమంద, ఎంపీటీసీ కటకం గోపాల్, సర్పంచ్ రాయపాటి మాణిక్యం, మండల ప్రచార కమిటీ కన్వీనర్ తోటకూర వెంకటేశ్వర్లు, కోట యోహాను, చలవాది సత్యనారాయణ, చాట్ల రమేష్, చాట్ల దీనయ్య, కటకం వెంకటేశ్వర్లు, శెట్టిపల్లి కోటేశ్వరరావు, సగ్గెల భుజంగరావు, ఫీల్డ్ అసిస్టెంట్ పూర్ణ తదితరులు ఉన్నారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద సుమారు 15 సంవత్సరాల క్రితం నిరుపేదలు బాబు జగ్జీవన్ రావ్ కాలనీ ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. నేటి వరకు కనీస సౌకర్యాలు తాగునీరు, రోడ్లు, పాఠశాలలు లేక పలు ఇక్కట్లకు గురవుతున్నరు. శనివారం నాడు కాంగ్రెస్ పార్టీ అట్లూరి విజయ్ కుమార్ బాబు జగజీవన్ రామ్ కాలనీలో పర్యటించి అక్కడ నివాసముంటు అష్ట కష్టాలు పడుతున్న వారిని చూసి చలించిపోయారు. 2005లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి ముఖ్య మంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి వినుకొండ పంచాయితీ నుండి మున్సిపాలిటీ గా అప్ గ్రేడ్ చేసి 100 కోట్లు నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ఈ కాలనీలో దళిత నిరుపేద బిడ్డలు నివాసం ఉంటున్న సంగతి పాలకులు మర్చిపోయారని ఇప్పటివరకు కనీసం మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. రానున్న కాలంలో ప్రతి ఒక్కరి సమస్య తెలుసుకొని ఈ కాలనీలో నివాసం ఉంటున్న అందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇచ్చేవరకు మౌలిక వసతులు కల్పించే అంతవరకు ప్రభుత్వంతో పోరాడి అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని కాలనీవాసులకు భరోసా కల్పించారు.

మందు బాబులకు అడ్డాగా తాలూకా ప్రాంగణం

విశాలాంధ్ర - రేపల్లె : అధికారుల పర్యవేక్షణ, పోలీసుల నిఘా లేకపోవటంతో తాలూకా ప్రాంగణం మందు బాబులకు అడ్డాగా మారింది. తహశీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్టర్ కార్యాలయ ఆవరణలో ప్రజల సౌకర్యార్థం దాతలు వేసిన సిమెంట్ బెంచీలపై కూర్చుని తాగి గ్లాసులను, కాళీ బాటిళ్లను అక్కడే పడవేస్తున్నారు. స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కార్యాలయం టౌన్, రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయ సిబ్బంది ఇటువైపుకు రాకపోవటంతో మందుబాబులు అడ్డాగా మార్చుకుని తాటికల్లు దగ్గర నుంచి మద్యం గంజాయి సేవిస్తూ వీరంగం వేస్తున్నారు. ఖాళీగా ఉన్న ప్రాంగణంలో మందు సేవించటంతో తరువాత రోజు ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపైన వచ్చే ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సివిల్ జడ్జి ఆధ్వర్యంలో లోక్ అదాలత్

విశాలాంధ్ర- చీరాల : మండల న్యాయ సేవాధికార సంస్థ, చీరాల ఆధ్వర్యంలో రాష్ట్ర న్యాయసేవాధికారి సంస్థ జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కోర్టు భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు ను స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎం సుధా మానవ అక్రమ రవాణా నిరోధక చట్టం గురించి మరియు వివిధ చట్టాల గురించి తెలియజేశారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి షేక్ రెహనా లోక్అదాలత్ గురించి న్యాయ సహాయం గురించి తెలియజేశారు. రమేష్ బాబు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు శ్రీ లక్ష్మీ అమ్మవారి తిరునాళ్ళ

విశాలాంధ్ర- యద్దనపూడి : మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి తిరునాళ్ళ ఆదివారం జరుగుతుందని ఆలయ కమిటీ ఆ ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 గంటలకు గురు ప్రార్థనతో ప్రారంభమై అమ్మవారికి కుంకుమార్చనలు అష్టోత్తర శతనామావళి పూజా కార్యక్రమం అమ్మవారి భక్తులచే పాల పొంగళ్ళు నివేదన కార్యక్రమం సాయంత్రం దేవస్థానం బృందం వారిచే భజన కార్యక్రమాలు రాత్రి అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు పరిసర గ్రామ ప్రజలు తిరుణాల మహోత్సవ వేడుకల్లో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని తెలిపారు.

నేడు వీరాంజనేయ స్వామి జయంతోత్సవాలు

విశాలాంధ్ర- యద్దనపూడి : మండలంలోని యనమదల గ్రామంలో వెలసిన వీరాంజనేయస్వామి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు డాక్టర్ మక్కెన రాంబాబు తెలిపారు. ఉదయం నుంచి హనుమాన్ చాలీసా పారాయణం సామూహిక భజనలు విశేష పూజలు అర్చనలు నిర్వహిస్తారని సాయంత్రం గుడి ప్రాంగణంలో కోలాట ప్రదర్శన ఉంటాయని, అన్నదానం చేపట్టినట్లు తెలిపారు.

సీతమ్మ స్ఫూర్తితో జనసేన అన్నదానం

విశాలాంధ్ర- వేటపాలెం : డొక్కా సీతమ్మ స్ఫూర్తితో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు వేటపాలెం మండలం జబ్బార్ కాలనీ వద్ద శనివారం జనసైనికులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా జనసేన నాయకుడు ఆల అనిల్ మాట్లాడుతూ స్థానిక జనసేన సైనికులు వారి సొంత ఖర్చులతో అన్నదాన కార్యక్రమాన్ని ముందుకు నడిపించడం అభినందనీయమని, రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య, జ్యోతి, కారంపూడి పద్మిని, పసుపులేటి సాయి, కర్ణ కిరణ్ తేజ, తోట చక్రవర్తి, జబ్బార్ కాలనీ జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

శుభ కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అద్దంకి : అద్దంకి పట్టణం నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కళ్యాణ మండపం నందు శనివారం జరిగిన రావూరి రంగయ్య,విజయలక్ష్మి దంపతుల మనుమళ్ళ నూతన వస్త్ర బహుకరణ వేడుకకు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హాజరై చిన్నారులు నిషిత్ చౌదరి, ఖుషాంత్ చౌదరిలకు ఆశీస్సులు అందజేశారు. తెదేపా మండల నాయకులు శంఖవరప్పాడు గ్రామానికి చెందిన పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాధవి దంపతుల కుమార్తె వివాహం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రవికుమార్ వధువు సాయి ప్రశాంతికి ఆశీస్సులు తెలిపారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర-అద్దంకి : స్థానిక కెఆర్కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల,గురువుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్,ఆహ్వాన కమిటి గౌరవ అధ్యక్షులు వి,మోహనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.పూర్వ విద్యార్థులు,గురువులు కార్యక్రమానికి హాజరై సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ కర్ణ లక్ష్మణరావు మృతి

విశాలాంధ్ర- వేటపాలెం : రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణ రావు(88) వేటపాలెం గ్రామం సజ్జ వారి వీధి లోని తమ స్వగృహం నందు అనారోగ్య కారణాల వలన శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. దాదాపుగా 40 సంవత్సరాల పాటు రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించి అంచెలు అంచెలుగాఎదిగి డిప్యూటీ కలెక్టర్ హోదాలో పదవి విరమణ చేశారు. అనంతరం బండ్ల బాపయ్య విద్య సంస్థలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ హోదాలో పనిచేశారు. వీరి మృతికి పలువురు రాజకీయ నాయకులు ,విద్యావేత్తలు ప్రగాఢ సానుభూతి తెలియజేసి నివాళులు అర్పించారు.

రామలింగేశ్వర స్వామి వార్షిక తిరుణాల

విశాలాంధ్ర- బల్లికురవ : మండల పరిధిలోని కొనిదెన గ్రామంలో వేంచేసి ఉన్న రామలింగేశ్వర స్వామి 14వ వార్షిక తిరుణాల శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఉదయం 5 గంటల నుంచి శివుడికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు,ప్రత్యేక అలంకరణ అమ్మవారికి కుంకుమ పూజలు కళ్యాణ మహోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 5 వేల మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, టిడిపి ఆధ్వర్యంలో భారీ విద్యుత్ ప్రభలు,పాట కచేరీలు,పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పరిమితికి మించితే జరిమానాలు తప్పవు

విశాలాంధ్ర - సంతమాగులూరు : ప్రయాణికులతో ప్రయాణిస్తున్న ట్రాలీ వాహనాలు పరిమితికి మించితే జరిమానాలు.. ఆపై జైలుకు పంపిస్తామని సంతమాగులూరు ఎస్సై ఎం.వి.శివకుమార్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఏల్చూరు టోల్ ప్లాజా నామ్ హైవేపై శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై కూలీలతో వెళ్తున్న వాహనాల డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రమాదాలపై ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పించారు. గ్రామంలో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

సాగర వీరులకు సీఎం జగన్ భరోసా

- రాష్ట్రవ్యాప్తంగా రూ.123.52 కోట్లు జమ
- 1,23,519 మంది మత్స్యకారులకు లబ్ధి
- 16న నిజాంపట్నంలో కార్యక్రమం

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : రాష్ట్రంలోని సాగర వీరులకు వైఎస్సార్ మత్స్యకార భరోసా అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం జగన్ భరోసా ఇవ్వనున్నారు. రాష్ట్రంలో తడ నుంచి ఇచ్ఛాపురం వరకు వెయ్యి కిలో మీటర్ల మేర తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఈ తీరం వెంట సాగర కెరటాల ఘోష, ఎగిసిపడుతున్న కడలి అలల మధ్య భీతి లేకుండా సాగర సమరం చేసే మత్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఆశయంతో సీఎం జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. సాగర గర్భంలో జీవనోపాధికై అనుక్షణం ప్రకృతి విసిరే సవాళ్ళను ఎదుర్కోంటూ చేపల వేటతో జీవనం సాగిస్తున్న మత్యకార కుటుంబాలకు అండగా ఉండేందుకు గత ప్రభుత్వాల కంటే మెరుగైన సంక్షేమం అందించేందుకు కృషి చేస్తున్నారు. చిత్తశుద్ధితో ఇచ్చిన హామీలకు తగినట్టుగా మత్స్యకారుల వేట నిషేధ సమయంలో మత్యకార భరోసా పథకం క్రింద రూ.10 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఏప్రియల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో వేట నిషేధ సమయాన్ని ప్రభుత్వం ప్రకటించింది. వేట లేని సమయంలో మత్యకారులు పడవలను, వలలను బాగు చేసుకుంటూ కాలం గడుపుతారు. వైఎస్సాఆర్ మత్యకార భరోసా క్రింద అర్హులైన ప్రతి మత్యకారునికి భరోసా అందించేందుకు ఆర్బికేల్లో పనిచేసే మత్యశాఖ సహాయకులు, వాలంటరీలు, సాగర మిత్రులతో కూడిన బృందంతో లబ్ధిదారులను గుర్తించారు. మెక్నైజ్డ్, మోటరైజ్డ్, ఆయిల్ ఇంజన్ బోట్లు నాటు పడవులతో చేపట వేట సాగిస్తూ జీవించే వారిని గుర్తించి వైఎస్సాఆర్ మత్యకార భరోసా అందిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,23,519 మంది మత్యకారులకు ఈ నెల 16వ తేదీనా బాపట్ల జిల్లా, రేపల్లె నియోజకవర్గం, నిజాంపట్నం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నోక్కి రూ.123.52 కోట్లు జమచేయనున్నారు. బాపట్ల జిల్లాలో మొత్తం 12,060 మంది లబ్దిదారులను గుర్తించారు. నిజాంపట్నం మండలంలో మత్యకార భరోసా లబ్దిదారుల మొత్తం 5065 ఉండగా, రేపల్లె మండలంలో 1824 మంది, చీరాల మండలంలో 1843 మంది, బాపట్ల మండలంలో 1369 మంది, చినగంజాం మండలంలో 983 మంది, వేటపాలెం మండలంలో 976 మంది మత్యకారులకు వైయస్ఆర్ మత్యకార భరోసాకు అందించనున్నారు. ఆక్వారంగ అభివృద్ధితోనే మత్యకారుల అభివృద్ధి సాధ్యమని భావించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మత్స్యకారుల అభ్యున్నతిపై దృష్టిసారించారు. రూ.1510 కోట్లతో రాష్ట్రంలో 4 ఫిషింగ్ హార్బర్‌లు, 25 ఆక్వాహబ్‌ల నిర్మాణం చేపట్టి మత్యకారుల అభివృద్ధికి కృషి చేశారు. నిజాంపట్నం హార్బర్ అభివృద్ధికి రూ.451 కోట్లు కేటాయించి, శరవేగంగా అభివృద్ధి పనులు చేపట్టారు. తాను అధికారంలోనికి వచ్చిన తర్వాత సాగన వీరుల సంక్షేమానికి వేట నిషేద సమయంలో ప్రభుత్వం అందించే భృతిని రూ.4 వేల నుండి రూ. 10 వేలకు పెంచారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వరుసగా 4 విడతలుగా పంపిణీ చేసి 5వ విడత పంపిణీ చేసేందుకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. డీజిల్‌పై సబ్సిడీని గతంలో ఉన్న రూ 6 సబ్సిడీని, రూ 9 పెంచి మత్యకారులకు ఆర్థిక భారం తగ్గించారు. మత్యకారులు వేట సమయంలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల రూపాయల వరకు ఉన్న భీమా సదుపాయాన్ని రూ. 10 లక్షలకు పెంచారు.

జోరుగా అక్రమ నీటి దందా..!

విశాలాంధ్ర- వేటపాలెం : మండలంలో నీటి అక్రమ వ్యాపారస్తులకు కాసుల పంట కురిపిస్తుంది. దాదాపుగా 50 నుండి 60 వరకు నీటి బోరింగులు ఏర్పాటు చేసుకొని అక్రమమార్గంలో నీటిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు వ్యాపారులు అయితే ఒక అడుగు ముందుకేసి రంగురంగుల లేబుల్స్‌తో ప్లాస్టిక్ బాటిళ్లు ఏర్పాటు చేసుకుని ఎలాంటి పర్మిషన్ లేకుండా యథేచ్ఛగా నీటిని అక్రమ మార్గంలో ఒక్కో బాటిల్ రూ.10 చొప్పున అమ్ముకుంటున్నారు. వేటపాలెం మార్కెట్ సెంటర్లో జనావాసాల మధ్య అక్రమంగా వాటర్ బాటిల్స్ తయారుచేసి అమ్ముతూ వ్యాపార సామ్రాజ్యం ఏర్పరచుకున్నారు. కొత్తపేటలో దాదాపు 20 వరకు కంపెనీలు ఏర్పాటయ్యాయి. 20 లీటర్ల వాటర్ టిన్నులపై ఎలాంటి స్టిక్కర్లు లేకుండా సీల్ మూతలు లేకుండా ప్రతి ఇంటికి తిరుగుతూ నీటి వ్యాపారం చేస్తున్నారు. నీటిని సప్లై చేసే ప్లాస్టిక్ టిన్నులను ఒకసారి పరిశీలిస్తే ఎలాంటి శుభ్రత లేకుండా అంతా పాచి ఏర్పడి ఉండటం గమనార్హం. మోటార్ బోర్లు డ్రైనేజీ పక్క బాత్రూములు పక్క వేసి వారి ఇష్టమైన రీతిలో నీటిని అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ జరుగుతున్న నీటి వ్యాపారానికి సంబంధించి ఒక్క వాటర్ తయారీ కేంద్రానికి ఐ.ఎస్.ఐ. మార్క్ లేకపోవడం గమనార్హం. అయినా ఏ ఒక్క అధికారి కూడా కన్నెత్తి చూడకపోవడం విడ్డూరం అని ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు నిద్ర లేచి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఇలాంటి నీటి బోగస్ కంపెనీలను ఏరివేసి ప్రజల ప్రాణాలను నిలపాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర- నిజాంపట్నం : వైఎస్సార్ మత్స్యకార భరోసా నగదు పంపిణీ కార్యక్రమానికి ఈ నెల 16వ తేదీన నిజాంపట్నంకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వస్తున్న సందర్భంగా సభా స్థలి ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లు, హెలిప్యాడ్ నిర్మాణ పనులను శనివారం రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జెసి శ్రీధర్ పరిశీలించి అధికారులకు తగు సూచనలు తెలియజేశారు. సభాప్రాంగణం ఏర్పాట్ల పనులు యుద్ధప్రాతికపై పూర్తి చేయాలని వారు ఆదేశించారు. వారి వెంట ఆదనపు ఎస్పీ పి.మహేష్, రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ, ఎంపీపీ మోపిదేవి హరినాథ్ బాబు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, నాయకులు మదన్, ప్రసాదం వాసుదేవ, రేపల్లె ఆర్.డి.ఓ పార్థసారథి, బాపట్ల ఆర్.డి.ఓ రవీంద్ర, చీరాల ఆర్.డి.ఓ సరోజిని, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్

విశాలాంధ్ర - కర్లపాలెం : సిఎం జగన్ రైతు పక్షపాతి అని బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి తెలిపారు. స్థానిక పెద్దింటమ్మ ఆలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో సీతారామిరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యంకు సరైన గిట్టుబాటు ధర కల్పించి ధాన్యంలో 90 శాతం పైగా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతు పక్షపాతిగా పెరు గాంచారని తెలిపారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రత్యేక చొరవ వలన బాపట్లలో అధికారులు 95 శాతం ధాన్యం కొనుగోలు చేసారని తెలిపారు. రైతు ధాన్యం అమ్మిన వారంరోజులలో నగదు రైతు బ్యాంక్ అకౌంట్లో జమ అవుతున్నాయని తెలిపారు. రైతుల తరపున సిఎం జగన్మోహన్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సీతారామి రెడ్డి తెలిపారు. రైతుల వద్ద ఇంకా మిగిలి ఉన్న ధాన్యం కూడా వారం రోజులలో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని సీతారామి రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ పందరబోయిన సుబ్బారావు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వర రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల యువజన అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షుడు ఆట్ల నాగేశ్వర రెడ్డి, ఎంపీటీసీ షేక్ ఆసీఫ్ అలీ, చింతాయపాలెం సొసైటీ చైర్మన్ మరకా పెద వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో జనసేన పొత్తు ఖాయం

విశాలాంధ్ర- సంతమాగులూరు : జనసేన పార్టీ రాష్ట్ర స్థాయిలో అన్ని మండలాల అధ్యక్షులతో సమీక్ష సమావేశం శుక్రవారం రాత్రి మంగళగిరి పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ హాజరై ప్రసంగించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి చల్లా వెంకట కృష్ణారావు, అద్దంకి ఇంఛార్జి కంచర్ల శ్రీకృష్ణ ఆధ్వర్యంలో ఐదు మండలాల జనసేన కన్వీనర్లు పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇతర పార్టీలతో జనసేన పొత్తు ఉంటుందని పవన్ కళ్యాణ్ కన్వీనర్లకు స్పష్టం చేశారు. సీఎం అభ్యర్థి ఎవరనేది ఎన్నికల తర్వాత బలబలాలను దృష్టిలో పెట్టుకొని ప్రకటించడం జరుగుతుందన్నారు. మండల స్థాయి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ సంతమాగులూరు మండల అధ్యక్షుడు గాదె రామాంజనేయులు, బల్లికురవ మూరగొండి రామకోటేశ్వరరావు, కొరిశపాడు పొట్టె నరసింహం, జె.పంగులూరు వీరహనుమాన్, అద్దంకి సాధు వెంకటేష్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ప్రజలకు వరం

విశాలాంధ్ర- కొరిశపాడు : ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా ప్రభుత్వం అందించే ఆరోగ్య సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని ప్రాసంగులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అనీష్ అన్నారు. ప్రైవేట్ హాస్పిటల్‌లో పరీక్షలకు, మందులకు ఎక్కువ డబ్బులు ఖర్చు ఆర్థికంగా ఇబ్బందులు పడే ప్రజలకు తన తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి ఆరోగ్యశ్రీ ద్వారా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే దిశగా ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. దీని ద్వారా అనేకమంది ప్రజలు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కలిగే విధంగా వైద్య ఆరోగ్య శాఖలో పెనుమార్పులను తీసుకువచ్చిన మార్గదర్శి తనయుడిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని పేద ప్రజలకు దగ్గర చేయాలని ఉద్దేశంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఉచిత పరీక్షలు ఉచిత మందులు గుండె జబ్బుల తో బాధపడే వారికి ఈసీజీ తీయించుకునే సౌకర్యం 104 సంచార వైద్య వాహనం ద్వారా అందించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రావినూతల గ్రామంలో నెలకు ఆరుసార్లు నిర్వహిస్తారని ఎస్సీ కాలనీలో సబ్ సెంటర్ ను ఏర్పాటు చేసి 104 సంచార వాహనములో ప్రజలకు దగ్గరగా 14 టెస్టులు చేసి ఉచితంగా 67 రకాల మందులను అందిస్తారని డాక్టర్ అనీష్ తెలిపారు. ఏఎన్ఎం సంధ్యారాణి ఎం ఎల్ హెచ్ పి రోజా హెల్త్ అసిస్టెంట్ ఫరీద్ ఆశా వర్కర్ సునీత డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీకాంత్ 104 పైలెట్ ఉదయ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

లోకేష్ యువగళం యాత్రకు మద్దతుగా నేడు కొండయ్య యాత్ర

విశాలాంధ్ర- చీరాల : లోకేష్ పాదయాత్ర వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా సోమవారం దేవాంగపురి హైస్కూల్ నుండి గడియారస్తంభవద్ద ప్రగడ కోటయ్య విగ్రహం వరకు పాదయాత్ర చేయడం జరుగుతుందని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి మద్దులూరి మాలకొండయ్య అన్నారు. యువగళం పాదయాత్ర వందరోజులు పూర్తి అవుతున్న సందర్భంగా చీరాల టీడీపీ కార్యాలయంలో మాలకొండయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాలకొండయ్య, మాజీ మహిళ కమిషన్ సభ్యురాలు తమ్మిశెట్టి రమాదేవిలు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందని,ఈ పాదయాత్రలో ప్రతి యొక్క తెలుగుదేశం అభిమాని పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజవల్లి శ్రీనివాసరావు,గంజి పురుషోత్తం, కౌతవరపు జనార్దన్,పమిడి రవి,శ్రీనివాస తేజ,తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు మార్చేది కాంగ్రెస్సే

విశాలాంధ్ర- బాపట్ల టౌన్ : కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించటంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు నేతృత్వంలో శనివారం సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని పలు ప్రధాన కూడలిలో భారీ ర్యాలీ నిర్వహించి, బాణా సంచా కాల్చుతూ మిఠాయిలు పంచారు.అనంతరం శ్రీ క్షీర భావన్నారాయణ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ కర్ణాటక రాజకీయం కాంగ్రెస్ పార్టీ వైపు తిరగడం బిజేపీకి చెంప పెట్టుగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దోనేపుడి దేవరాజ్, రవి బాబు,వేమూరు ఇంచార్జీ వెంకటేశ్వరరావు,శీలం సాగర్,పఠాన్ రాజేష్,రోశయ్య,యస్వి అర్ కుమార్, దండు రేణుకా,కట్ట లాజర్,తదితరులు. పాల్గొన్నారు.

జీవో1 రద్దు వైసీపీకి చెంపపెట్టు

విశాలాంధ్ర- బాపట్ల టౌన్ : రాష్ట్రంలో జీవో నెం.1 రద్దు చేయడం వైసీపీకి చెంపపెట్టు అని మాజీ కేంద్రమంత్రి తెలుగుదేశం నాయకురాలు పనబాక లక్ష్మి, బాపట్ల ఇన్చార్జి వేగేశన నరేంద్రవర్మ రాజులు పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇరువురు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మీటింగ్‌లను చూసి వస్తున్న అభిమానం చూసి వైసిపి నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తట్టుకోలేక భయపడి జీవో నెం.1 తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు ఒకటి కూడా లేకుండా, తాడేపల్లి నివాసంలో కూర్చొని బటన్ నొక్కడం కాదని ఎద్దేవ చేశారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే దళితులకు చేసిన మేలేంటో తెలియ పరచాలని సూచించారు. రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలియజేశారు.వేగేసిన ఫౌండేషన్ వారి నేతృత్వంలో ఆదివారం జరిగే నిర్వహిస్తున్నటువంటి మహా రుద్రాభిషేకమును విజయవంతం చేయాలని బాపట్ల నియోజకవర్గ ప్రజలను కోరారు. అనంతరం సూర్యలంక బీచ్‌లో నిర్మించిన తారకేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దైవ ఆశీస్సులను పొందారు. ఈ కార్యక్రమంలో పట్టణ మండల పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, ప్రమీల రాణి, సరోజినీ, జీవన్, ఫరీద్ మస్తాన్వలి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ఘతానికి గురైన ఆపరేటర్

విశాలాంధ్ర- బాపట్ల రూరల్ : బాపట్ల బీచ్ సబ్ స్టేషన్ క్రొత్త వాడరేవు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ చెల్లీ రవికుమార్ శనివారం విద్యుత్ మరమ్మతులు చేస్తూ విద్యుత్ ఘాతానికి గురైయ్యారు. ఇటీవల కాంట్రాక్టర్ బేసిక్ మీద ఉద్యోగంలో చేరిన రవికుమార్ ఆపరేటర్ రవికి విద్యుత్తు షాకుకు గురై చేతులు,కాళ్లు కాలిపోయాయి. దీంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. పాండురంగపురం జేఎల్ఎం మేకల వెంకటేశ్వర్లు నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు.

రైతులను పట్టించుకోని జగన్ ప్రభుత్వం

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత

విశాలాంధ్ర- బాపట్ల రూరల్ : జగన్ ప్రభుత్వం కౌలు రైతులను పట్టించుకోవడం లేదని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు అన్నారు. అంబేద్కర్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాల వల్ల నష్టపోయిన కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలు పూర్తిస్థాయిలో కౌలు రైతులకు నష్టపరిహారం ఇప్పటి వరకు అందలేదన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి కొచ్చిర వినయ్ రాజు మాట్లాడుతూవైసీపీ ప్రభుత్వం ప్రతి పంటకు గిట్టుబాటు ధర ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇప్పుడు గిట్టుబాటు ధర ఇవ్వటం లేదన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

శరవేగంగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు

విశాలాంధ్ర - నిజాంపట్నం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. వైఎస్సార్ మత్స్యకార భరోసా నగదు పంపిణీ కార్యక్రమానికి ఈ నెల 16వ తేదీన నిజాంపట్నంకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరవుతున్న సందర్భంగా బాపట్ల జిల్లా అధికార యంత్రాంగం అంతా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు సారధ్యంలో పనులు సాగుతున్నాయి.అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనకు చేపట్టవలసిన అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు.

ఎన్ఆర్ఈజీఎస్‌ను నిర్వీర్యం చేస్తున్నారు..

విశాలాంధ్ర - పిట్టలవాని పాలెం : ఎన్ఆర్ఈజీఎస్ పథకంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెల్టి భాగ్య శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలోని చందోలులో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశంలో పనిచేస్తున్న వ్యవసాయ కార్మికులను కలిసి వారికి అన్ని సదుపాయాలు అందుతున్నాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పని ప్రదేశంలో వారికి ఏ ఒక్క సదుపాయం కల్పించడం లేదని తీవ్రమైన ఎండకు ఆ పని ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ, ప్రాథమిక చికిత్స పరికరాలు, టెంట్ సౌకర్యం కూలీలకు పని ప్రదేశంలో సక్రమంగా కల్పించడం లేదన్నారు. 100 రోజులకు 10 నుండి 15 రోజులు మాత్రమే పని కల్పిస్తున్నారని, సక్రమంగా కూలీ అందించటం లేదని ఈ విధానం పూర్తి ప్రభుత్వ వైఫల్యం మని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ అనునిత్యం పని ప్రదేశాలలో ఈ సదుపాయాలు కల్పించాలని చెప్పి ప్రకటనలకే పరిమితం అవుతున్నాయని, అన్ని గ్రామాలలో కార్డు తోటి సంబంధం లేకుండా పని కల్పించాలని శ్రీధర్ కోరారు. కావున గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సక్రమంగా నిధులు కేటాయించి 100 రోజులు పని కల్పించాలని, దినసరి వేతనం రూ. 600 ఇవ్వాలని అయన డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ లీడర్ మామిడి బత్తుల గణేష్, ఏఐటీయుసి జిల్లా అధ్యక్షులు షేక్ కరీముల్లా, షేక్ జిలాని, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులకు అడ్డుకట్ట వేయాలని వినతి

విశాలాంధ్ర- సంతమాగులూరు : మాల మహానాడు రాష్ట్ర నేతలు సంతమాగులూరు పీఎస్ ఎస్సై ఎం.వి.శివకుమార్ ని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా దళితుల మీద దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఎస్సైని కోరారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ.. సంతమాగులూరు మండల పరిధిలో అటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఒకవేళ అలాంటి దాడులు జరిగినట్లు తమ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని మాల మహానాడు నేతలు పేర్కొన్నారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిమాల కాంతారావు, వీసీకే పార్టీ నర్సరావుపేట నియోజకవర్గ ఇంఛార్జి కూచిపూడి చంద్ర, సీహెచ్.లక్ష్మణరావు, ఎన్నికల వినోద్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఎస్సై శివకుమార్‌ని శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

ధ్వజ స్థంభం ప్రతిష్ఠలో పనబాక

విశాలాంధ్ర- బాపట్ల రూరల్ : సూర్యలంక సముద్ర తీరంలో రాతి శిల్పాలతో నూతనంగా నిర్మించిన శ్రీ విజయ గణపతి అన్నపూర్ణ సమేత శ్రీ తారకేశ్వర స్వామి దేవస్థానం వద్ద జరిగిన నందీశ్వర ధ్వజస్తంభం ప్రతిష్ఠపన మహోత్సవంలో మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పనబాక లక్ష్మీతో పాటు బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ వేగేశన నరేంద్ర వర్మ, పార్లమెంటరీ ఉపాధ్యక్షురాలు పల్లం సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

నిదానంపాటి లక్ష్మీ అమ్మవారికి పూజలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండలంలోని ఏల్చూరులో శ్రీ నిదానంపాటి లక్ష్మీ అమ్మవారికి శుక్రవారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. గ్రామ భక్తజనం బృందం ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ప్రత్యేక పందిరి ఏర్పాటు చేసి అమ్మవారి చిత్రపటాన్ని నెలకొల్పారు. పూజారులు అమ్మవారికి అభిషేకాలు జరిపి పూలతో సుందరంగా అలంకరించారు. నాగమయ్య నామాల పుట్టను ఇసుకతో తయారు చేశారు. మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించారు. భజనా బృందం ప్రత్యేక భక్తి పాటలను ఆలపించారు. అనంతరం భారీఎత్తున అన్నదానం చేశారు.

6వ రోజు వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర - సంతమాగులూరు : సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు 6వ రోజు శనివారం నిర్వహించారు. గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు. చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా 34 మంది విద్యార్థులు లైబ్రరీలోని స్వాతంత్ర్య సమర యోధులు జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్, చందమామ కథలు, ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన పుస్తకాలను పఠనం చేశారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో లైబ్రరీకి ఎక్కువ మంది పిల్లలు వచ్చేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వధూవరులకు ఎమ్మెల్యే గొట్టిపాటి ఆశీర్వాదం

విశాలాంధ్ర - సంతమాగులూరు : సంతమాగులూరు మండలంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం పర్యటించారు. పత్తేపురం గ్రామంలో గొట్టిపాటి వెంకట్రావు (లేటు), తులశమ్మ దంపతుల కుమారుడు సురేష్ బాబు, శ్రావణి వివాహం రెండు రోజుల క్రితం జరిగింది. శనివారం సత్యనారాయణ స్వామి వ్రతం మహోత్సవానికి అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి.. శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సజ్జాపురంలోని గంద్రు సుబ్బారావు, సుబ్బాయమ్మ దంపతుల కుమారుడు శ్రీకాంత్, ప్రత్యూష నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. అదేవిధంగా ఆ గ్రామం తెలుగుదేశం పార్టీ నాయకులు గొట్టిపాటి నాగేశ్వరరావు, హనుమాయమ్మ దంపతుల కుమారుడి వివాహం సందర్భంగా నూతన వధూవరులు అజయ్ కుమార్, సాయి శ్రీ హర్షిత'లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

అనాధ వృద్ధ శరణాలయనికి విరాళం

విశాలాంధ్ర - వేటపాలెం : పందిళ్ళపల్లికి చెందిన రిటైర్డ్ మాస్టారు కోనంకి పరబ్రహ్మం రూ. 20 వేల నగదు రూపంలో నీలకంఠాపురం అనాధ వృద్ధాశ్రమాలయం కమిటీ పెద్దలు సత్రం మల్లేశ్వరరావు, గుత్తి విశ్వేశ్వరరావులకు అనాధ వృద్ధ శనార్థాలయంలో ఉన్న వృద్ధుల భోజనం ఏర్పాటుకై శాశ్విత విరాళము ఇచ్చారు.ప్రతి సంవత్సరము ఆశ్రమమునకు రూ.10 వేల ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ మార్పు గ్రగోరి కమిటీ పెద్దలు గుత్తి విశ్వేశ్వరరావు, మార్పు శాంసన్, విశ్రాంత ఉపాధ్యాయులు చల్ల వాసు, పింజుల రాము, బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు కుర్మా రాహుల్ జి, యారాస్ అరుణ్ బాబు, బండ్ల బాబు, పృథ్వీ ఆదిశేషు, మాస్టారులు జగదీష్, సాంబశివరావు మొదలగుడివారు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న అమ్ముకోవాలి

విశాలాంధ్ర - వేమూరు : రైతులు పండించిన మొక్కజొన్న, జొన్న పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకురైతులు అమ్ముకోవాలని రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు అక్బర్ హుస్సేన్ తెలియజేశారు, శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో మొక్కజొన్న పంటలను, వర్షాలు కారణంగా తడిసిన మొక్కజొన్న కళాలను పరిశీలించారు,